లైన్‌మన్ లేక అవస్థలు

- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు

మాక్లూర్ : మండలంలోని గొట్టిముక్కల, చిక్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వల్లభాపూర్ గ్రామానికి లైన్‌మన్ లేక మూడు నెలలుగా రైతులు అవస్థలు పడుతున్నారు. ఇంతకు ముందు ఉన్న లైన్‌మన్ సురేశ్ బదిలీలో భాగంగా మూడు నెలల క్రితం ఇతర చోటికి బదిలీ అయ్యారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఆయన స్థానంలో ఎవరూ రాకపోవడంతో రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడే చెట్లకు పేరుకుపోతుండడంతో సమస్యలు నెలకొంటున్నాయి. విద్యుత్ సరాఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. మూడు నెలలుగా లైన్‌మన్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామంలో ఇప్పటికే ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి లైన్‌మన్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



లైన్‌మన్ బదిలీపై వెళ్లి మూడు నెలలు అవుతోంది. అతని స్థానంలో ఇంకా ఎవరూ నియామకం కాలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. అధికారులు లైన్‌మన్‌ను నియమించాలి.

– శిలారి సుధాకర్, రైతు, వల్లభాపూర్

లైన్‌మన్‌ను నియమిస్తాం

వల్లభాపూర్‌కు మూడు నెలలుగా లైన్‌మన్ లేని మాట వాస్తవం. నేను కొత్తగా వచ్చాను. గ్రామ రైతులకు ఇబ్బందులు ఉంటే చిక్లి లైన్‌మన్‌కు చూడాలని చెప్పాను. అతను వర్క్ లోడ్ వల్ల రాలేదు. త్వరలో పర్మినెంట్ లైన్‌మన్‌ను నియమించేందుకు కృషి చేస్తా.

– సయ్యద్ ఇలియాజ్ హైమద్, ఏఈ



వల్లభాపూర్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్ల కొమ్మలు

క్లుప్తంగా

ట్రస్మా జిల్లా అధ్యక్షుడికి సన్మానం



బోధన్: పట్టణ కేంద్రంలోని ఇందూర్ విద్యాసంస్థల అధినేత, తెలంగాణ ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) జిల్లా అధ్యక్షుడిగా కొడాలి కిశోర్ ఎన్నికైన సందర్భంగా మంగళవారం టీఎస్‌పీ(తెలంగాణ స్టూడెంట్ పరిషత్) జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సన్మానించారు. నాయకులు అనిల్, శివ పాల్గొన్నారు.

అంక్సాపూర్‌లో విజయోత్సవ ర్యాలీ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్‌లో స్థానిక హైస్కూల్ విద్యార్థులు మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మండలంలోని మోతె హైస్కూలులో నిర్వహించిన మండలస్థాయి క్రీడల్లో అంక్సాపూర్ విద్యార్థులు ఆరు పోటీల్లో విజయం సాధించారు. దీంతో తమ విజయాన్ని ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆర్మూర్‌టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ రమేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడొప్పద్దని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ఆటో నడపరాదన్నారు. ట్రాఫిక్ ఎస్సై రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులను విడుదల చేయాలి



బోధన్: పెండిగ్‌లో ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ(ఎస్) జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు పట్టణ కేంద్రంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు మంగళవారం వినతి పత్రం అందించారు. మూడున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే వాటిని మంజూరు చేయాలన్నారు. నాయకులు సాయికుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా శ్రీకాంత్‌యాదవ్

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఏర్పడిన ముప్కాల్ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గైని సంజీవ్, సహ కార్యదర్శులుగా కట్ట మహేశ్, గంగాధర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శివకుమార్, జక్కుల రాము, ఉపాధ్యక్షులుగా సాగర్‌గౌడ్, చిన్నబాలరాజ్, కల్లు స్వామి, శ్రీధర్, నడ్పిరాజన్న, 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బైబిల్ కళాశాల ప్రారంభం



పెర్కిట్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ రాక్ చర్చిలో బైబిల్ కళాశాలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ వందన కుమార్ హాజరై మాట్లాడారు. ఇండియా థియలాజికల్ సెమినరీ అనే ఈ బైబిల్ కళాశాల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో 79 గ్రాడ్యుయేషన్స్ పూర్తి చేసుకుందన్నారు. కళాశాలలో ప్రతి నెల రెండు రోజుల చొప్పున తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలంగాణ డైరెక్టర్ జీవన్ కుమార్, డాక్టర్ అశోక్, డాక్టర్ మత్తయి, రెవరెండ్లు మోహన్, అమోస్, పాస్టర్లు జీవరత్నం, కాంతయ్య, ప్రభాకర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బంటు మహిపాల్, గంగారాం, మాజీ ఎంపీటీసీ యాల్ల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ బి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోళ్లు



తాళ్లరాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి

మోర్తాడ్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి తరుగు లేకుండా రైతుల నుంచి ధాన్యం సేకరణ జరుగుతోందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో విపరీతంగా తరుగు తీసి నాయకులు, అధికారులు, మిల్లర్లు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఎలాంటి తరుగు లేకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.500ల బోనస్‌ను చెల్లిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట నాయకులు శివన్నోల్ల శివకుమార్, దేవారెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, కొత్రెపల్లి లింగారెడ్డి, ముస్కు మోహన్, దేశబోయిన సంజీవ్, దోంచంద వెంకట్‌రెడ్డి, శ్యామ్‌సన్, మధు తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

బాల్కొండ: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ముప్కాల్ మండలం రెంజర్లలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. పార్టీ నాయకులు చిన్నారెడ్డి, ముత్యంరెడ్డి, గంగాధర్, నారాయణ, ఆకుల రమేశ్, షరీఫ్ ఉన్నారు.

సింహగర్జన సభను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోధన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని జింకాన గ్రౌండ్‌లో డిసెంబర్ 1న మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే మాలల సింహగర్జన సభను మాలలు విజయవంతం చేయాలని జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో బోధన్‌లోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించారు. మాలల సింహగర్జన గోడప్రతులను ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికితే సహించేది లేదన్నారు. సమావేశంలో అలుక కిషన్, ఆనంపల్లి ఎల్లం, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఈశ్వర్, రాము, కారం స్వామి, శ్రావణ్‌కుమార్, పెర్క రామకృష్ణ, సంజు, డిస్కో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



నందిపేటలో..

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయాల్లో, పలు ప్రాంతాల్లో నాయకులు కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. దేశం కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



ఉప్లూర్‌లో..



ఆర్మూర్‌లో..



కోటగిరిలో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పోచంపల్లిలో చెక్కు అందజేస్తున్న నాయకులు



కొత్తపల్లిలో చెక్కు అందజేస్తున్న నాయకులు

వేల్పూర్/ బాల్కొండ: వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం అందజేశారు. పార్టీ వేల్పూర్ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి, వేంపల్లిలో..

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి, వేంపల్లి గ్రామాల్లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగెట్ జైడి రవికుమార్, వేంపల్లి సహకార సంఘం అధ్యక్షుడు జక్క రాజేశ్వర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి/ మోర్తాడ్: కమ్మర్‌పల్లి, ఉప్లూర్, నాగాపూర్ గ్రామాల్లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, నాయకులు బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గిర్మాజి గంగాధర్, జక్కం అశోక్, తక్కూరి సతీశ్, బూత్‌పురం మహిపాల్, ముత్యాల రాములు, చిన్న గంగారాం, పుప్పాల అశోక్, శ్రీధర్, నసీర్, అమ్జాద్, తెడ్డు గురువయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో చెక్కులు అందజేస్తున్న నాయకులు



మోర్తాడ్‌లో..

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎడపల్లి : ముదిరాజ్ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని జానకంపేటలో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో సంఘ సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సున్నం ఒడ్డెన్న, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, ఉపాధ్యక్షులుగా యాసాడ రాజ్‌కుమార్, పాల్క స్వామి, గుండ శ్రీనివాస్, కొండ జంబు, సహాయ కార్యదర్శిగా జోడు నర్సింలు, కోశాధికారిగా కొండ అశోక్, కార్యనిర్వహణ కార్యదర్శిగా గండి మనోజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సున్నం అశోక్, స్వామి, శ్రీనివాస్, సలహాదారులుగా పెసరి ఆంజనేయులు, కుంట శ్రీనివాస్, గుండారం సాయిలు, కార్యవర్గ సభ్యులుగా బండారి నర్సింలు, సున్నం మల్లయ్య, కిష్టాపురం నర్సింలు, సిరివెసు రవి ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి



పెర్కిట్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అంకాపూర్ గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె వినోద్ రెడ్డి కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి రూ.28 వేల సొంత ఖర్చులతో గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సాగర్, కుమార్ గౌడ్, భూమేశ్, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్‌రెడ్డి, ప్రదీప్, తరుణ్, నర్సయ్య, అనంత్, మహిపాల్, కేకే వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



పెర్కిట్: ఆర్మూర్ మండలంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. మండలంలోని కోమన్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన సర్వేను సూపర్‌వైజర్, ఎంఈవో రాజ గంగారాం పరిశీలించారు. గ్రామంలో 523 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 489 కుటుంబాల సర్వే పూర్తయిందని అన్నారు. జీపీ కార్యదర్శి నవీన్, ఎన్యుమరేటర్లు రమేశ్, జ్యోతి, కారోబార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



వర్ని: మోస్రా మండలంలోని చే నెంబర్ తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత, రామారావు మహరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామంలో మంగళవారం విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం నూతనంగా నిర్వహించిన ఆలయ ప్రాంగణంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. బుధ, గురువారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు, బోగి బండార్ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గోశాలకు విరాళం



వేల్పూర్: మండలంలోని లక్కోరలో అమ్మ గోశాల, అన్న ప్రసాద ట్రస్ట్‌కు స్థానిక ప్రభుదాస్ కిశోర్‌దాస్ బీడీ టేకెదార్ల సంఘం తరఫున రూ. 25 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టేకెదార్ల సంఘం అధ్యక్షుడు జగదీశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తడపాకల్‌కు ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరు



మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని తడపాకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు రూ. 6.50 లక్షల నిధులు మంజూరైన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు మంగళవారం వారు భూమిపూజ చేశారు. మాదిగ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, పాత హనుమాన్ ఆలయాల ప్రహరీ నిర్మాణాలకు మంజూరైన నిధులతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



జిల్లా జడ్జికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

- జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: అందమైన ప్రపంచాన్ని మనకు పరిచయం చేసే అవయవం, దేహంలోని ముఖ్యమైన భాగం నేత్రమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సౌజన్యంతో డాక్టర్ అగర్వాల్ కంటి దవాఖాన వారు జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సమావేశపు హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సామాజిక దృక్పథంతో వైద్యారోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పని ఒత్తిడికి లోనవుతారని దాని వలన కళ్లపై ప్రభావం పడుతుందని అన్నారు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్స్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌ల వినియోగంతో కంటి చూపు సమస్యలు నెలకొంటాయని, దీనిని అధిగమించడానికి కంటి వైద్యపరీక్షలు చేసుకోవాలని అన్నారు. డాక్టర్ శరత్ జోషి, ఆస్పత్రి ఆప్తమలిస్ట్ విభవ్, చరణ్‌గౌడ్, గణేశ్ సంజయ్ న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. జడ్జి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి గవర్నమెంట్ ప్లీడర్ వెంకట రమణగౌడ్, న్యాయవాదులు ఎం లక్ష్మణ్, కవిత రెడ్డి, అంజలి, రజిత, ఆరెటి నారాయణ, రాణదేశ్, మాణిక్ రాజు, విఘ్నేశ్, చింతకుంట సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడమ్మ బోనాలు



మాక్లూర్: మండల కేంద్రంలో యాదవ సంఘం సభ్యులు మంగళవారం రాత్రి చౌడమ్మ బోనాలను ఊరేగించారు. డోలు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రామాలయంలో కార్తీకమాస పూజలు



వేల్పూర్: మండల కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో వేదపండితులు కరుణాకర్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం కార్తీకమాసం పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. రుద్రాభిషేకం, ఇతర పూజలు చేపట్టారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 -	గ్లాడియేటర్-2 (తెలుగు)-9.35 7.35 లక్కీ భాస్కర్ 12.50 10.50 అమరన్(తెలుగు)-4.05
స్క్రీన్-2 -	డమ్మీ మూవీస్ -3.00 5.30 8.00 10.30
స్క్రీన్-3 -	కంగువ (తెలుగు)-12.00 3.20 6.40 10.00
స్క్రీన్-4 -	అమరన్(తెలుగు)-11.30 మట్కా(తెలుగు)-3.00,6.25,9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800